క్లుప్తంగా

మిషన్ భగీరథ నీరు నేలపాలు



పైప్‌లైన్ నుంచి భగీరథ నీరు లీకేజీ

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని ఆయా కాలనీల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు లీకేజీ అవుతున్నాయి. పురపాలక అధికారులు, మిషన్ భగీరథ అధికారుల సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. పట్టణంలోని చాణిక్యపూరి కాలనీకి వెళ్లే మార్గంలో కొన్ని వారాలుగా భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు లీకేజీ అయి, కిలో మీటర్ మేర పారుతున్నా పట్టించుకునే వారే లేరు. ఇదే మార్గంలో విద్యార్థులు నడవాల్సిన పరిస్థితి నెలకొంది. మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తడబ్బాలు ఏర్పాటు తప్పనిసరి



మాట్లాడుతున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: హోటళ్లలో తడి, పొడి చెత్తకు తప్పనిసరిగా వేర్వేరు డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. శనివారం హోటళ్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటళ్ల నుంచి వెలువడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేసి చెత్త తరలించే ఆటోల్లో వేయాలని సూచించారు. ఆహారం విషయంలో నాణ్యతాప్రమాణాలను పాటించాలన్నారు. ఆకస్మికంగా తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మేనేజరు వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోటీల్లో క్రీడాస్ఫూర్తి చాటాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్ అన్నారు. యువతను ప్రోత్సాహించడంలో భాగంగా ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో ఎంపీ సురేష్‌షెట్కార్ సహకారంతో నిర్వహించిన నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నీ విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. పట్టణానికి చెందిన జులూం టీం విజయం సాధించగా రూ.50వేల నగదు, ట్రోఫీ, రెండో బహుమతి ఎంకేసీ జట్టుకు రూ.22, 222 నగదుతో పాటు ట్రోఫీని బహూకరించారు. జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, పీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, యువనాయకులు సాగర్ షెట్కార్, టోర్నీ నిర్వాహకులు భూపాల్, సాయి దిగ్వాల్, సాయి చరణ్, పవన్, నోమాన్ పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌తో సృజనాత్మక శక్తి



ఏర్పాటు చేసిన ప్రదర్శనలు

నారాయణఖేడ్: సైన్స్ ఫెయిర్‌తో సృజనాత్మక, ఆలోచనా శక్తి పెరుగుతుందని ఖేడ్ నెక్సస్ పాఠశాల కరస్పాండెంట్లు నరేష్‌కుమార్, కిషన్ తెలిపారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను ఇస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఈనెల 23న నిర్వహించనున్న బసవ లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హనుమంత్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

- నైబర్‌హుడ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న పలు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రామచంద్రాపురం, (పటాన్‌చెరు): గేటెడ్ కమ్యూనిటీకాలనీ వాసుల మధ్య మరింత స్నేహపూరిత వాతావరణం నెలకొల్పాలన్న లక్ష్యంతో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు పలు ప్రాంతాలకు చెందిన గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. గత మూడు ఏళ్లుగా క్రీడాపోటీలు జరుగుతున్నాయి. ప్రారంభంలో కేవలం తెల్లాపూర్ పరిధిలోని కాలనీ వాసులు మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం తెల్లాపూర్, మణికొండ, నల్లగండ్ల, నర్సింగ్, కోకాపేట్, మోకిలా ప్రాంతాలకు చెందిన 73 గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకు చెందిన సుమారు 1500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. గత నెల జనవరి 26న ప్రారంభమైన క్రీడలు మార్చిలో ముగియనున్నాయి. ప్రతి శని, ఆదివారాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వాలీబాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, త్రోబాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి ఆటలు ఆడుతారు. ఒక్కొక్క క్రీడకు ఒకరు కన్వీనర్‌గా వ్యవరిస్తున్నారు. మరికొన్ని క్రీడల కోసం ప్రాంగణాలను అద్దెకు తీసుకుంటున్నారు. క్రీడాపోటీల్లో 11ఏళ్ల చిన్నారుల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రధానంగా కాలనీల మధ్య మంచి స్నేహపూరిత వాతావరణం తీసుకోరావడం కోసం క్రీడాపోటీలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహుకులు చెబుతున్నారు.

క్రీడలతో ఆరోగ్యం



క్రీడలు ఆడటం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటాం. దానిని దృష్టిలో పెట్టుకొని గత మూడేళ్లుగా గేటెడ్ కమ్యూనిటీ వాసులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నాం. పోటీల వల్ల కాలనీవాసుల మధ్య మరింత స్నేహం పెరుగుతుంది.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఉత్సాహంగా పాల్గొంటున్నారు..



క్రీడాపోటీల్లో కాలనీవాసులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతి ఒక్కరు నిత్యం గంట సమయం క్రీడలకు కేటాయించాలని కోరుతున్నాం. క్రీడలు ఆడటం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉంటాం.

– రవికుమార్, బ్యాడ్మింటన్ కన్వీనర్

‘సహకార నిధి’ పథకంతో లబ్ధి



డిపాజిట్లు స్వీకరిస్తున్న మేనేజర్

నారాయణఖేడ్: జిల్లా సహకార బ్యాంకు ప్రారంభించిన సహకార నిధి డిపాజిట్ పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ డీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటేశం కోరారు. శనివారం మండలంలోని పైడిపల్లిలో సహకార నిధి పథకంపై ఖాతాదారులు, గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పథకం ద్వారా డిపాజిట్లు చేసుకునే వారికి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. తమ బ్యాంకు ఖాతాదారులకు లాకర్ల సౌకర్యం, గూగుల్‌పే, ఫోన్ పే, ఆన్‌లైన్, ఏటీఎం సౌకర్యం ఉందన్నారు. వ్యవసాయ రుణాలు, పాడి పరిశ్రమకు పౌల్ట్రీ, మత్స్య పరిశ్రమలకు కూడా రుణాలు అందిస్తున్నామన్నారు. వ్యాపార రుణాలు, హౌసింగ్ లోన్లు, బంగారు ఆభరణాలపై కూడా రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఖాతాదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ అశోకరెడ్డి, సీఈఓ జగన్నాథ్, నాయకులు రవి, రాంగొండ, ఫీల్డ్ ఆఫీసర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కులాంతర వివాహాలకు చట్టం చేయాలి



కులాంతర జంటలను సన్మానిస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కులాంతర వివాహాలకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డిలోని సుందరయ్యభవన్‌లో కులాంతర వివాహితుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జంటలను సత్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలోనే ఉందన్నారు. కుల వ్యవస్థ సాటి మనిషిని మనిషిగా చూడలేదని పశువుల కంటే హీనంగా చూస్తుందని వాపోయారు. ఇటీవల రాజస్తాన్ అసెంబ్లీ ప్రత్యేక రక్షణ చట్టం కోసం తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో ఒక శాతం ప్రాధాన్యం, ఇంటి స్థలం ఇచ్చి డబుల్ బెడ్ రూం నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది సుభాష్, సామాజిక ఉద్యమకారుడు బస్వరాజు కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేసిన రోడ్డు

నారాయణఖేడ్: పట్టణంలో అధ్వానంగా మారిన బైపాస్ రోడ్డుకు శనివారం మరమ్మతులు చేపట్టారు. పట్టణ శివారులోని పంచగామ కమాన్ నుంచి సేవాలాల్ చౌక్ వరకు 11 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు ధ్వంసమైంది. గుంతలమయంగా మారిన ఈ రోడ్డుపై వాహనదారులు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డికి తెలియజేయడంతో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ కంకర, మొరంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రోడ్డు పనులు చేస్తుండటంతో పట్టణవాసులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ గ్యాస్ సిలిండర్ల సీజ్



సీజ్ చేసిన సిలిండర్లు

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. శనివారం మొగుడంపల్లిలోని హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల గోదాంలో ఇండెన్, భారత్ కంపెనీలకు చెందిన 196 కమర్షియల్ సిలిండర్లు నిల్వచేసి ఉండటంతో అధికారులు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకువచ్చి చిన్న సిలిండర్లలో గ్యాసును నింపేందుకు వీలుగా వీటిని నిల్వచేసి ఉంచినట్లు అధికారులు తెలిపారు. గ్యాస్ గోదాం నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన సిలిండర్లను జహీరాబాద్ గోదాంకు తరలించారు. దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వరూప, షాబుద్దీన్, సివిల్ సప్‌లై అధికారులు బసవరాజు, ఆర్‌ఐ సాయికిరణ్, పోలీసులు పాల్గొన్నారు.

జీవాలకు ముందస్తు టీకాలు



వ్యాక్సినేషన్ వేస్తున్న పశువైద్యాధికారి

ఝరాసంగం(జహీరాబాద్): జీవాలు రోగాల బారిన పడకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని సిద్దాపూర్‌లో పశుసంవర్ధక శాఖ, డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రం, ప్రైవేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి, జీవాలకు వ్యాక్సినేషన్‌తో పాటు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి పెంచుకోవాలని, పాడి పశువులు అభివృద్ధి చెందాలన్నారు. పోషకాలు గల మేత , మినరల్ మిక్చర్ పశువులకు అందించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.కైలార్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య కృష్ణ, బాగప్ప శివకుమార్, గోపాలమిత్రులు అశోక్ రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి



మృతులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్‌పీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని న్యాల్‌కల్ మండల సమగ్ర శిక్షణా ఉద్యోగులు డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా చెగుంట మండలం మక్కరాజన్నపేట జెడ్పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న రమేష్, శ్రీనివాస్ బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో ఇరువురు అక్కడిక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్‌పీల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ రవి, సీఆర్‌పీలు విశ్వనాథ్, రాజు, మాణిక్ మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ మోహన్, గోపాల్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ గొప్ప సంఘసంస్కర్త



కల్హేర్: బల్కంచెల్క తండాలో సంత్ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటాలకు నివాళి, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షించుకునే దిశగా సంత్ సేవాలాల్ జీవితాంతం పోరాటం సాగించారన్నారు. నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.



సంగారెడ్డి జోన్: ర్యాలీ చేస్తున్న నాయకులు



ఝరాసంగం : జయంతిలో తండావాసులు



పటాన్‌చెరు టౌన్: సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు తదితరులు



జహీరాబాద్: జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్డీఓ రామ్‌రెడ్డి, నాయకులు

వ్యర్థాలు కాల్చుతున్న వారిపై చర్యలు



వ్యర్థాలను కాల్చడంతో కమ్ముకున్న పొగ

పటాన్‌చెరు టౌన్: వ్యర్థ పదార్థాలను నిల్వ చేసి కాల్చుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బండ్లగూడ కాలనీవాసులు డిమాండ్ చేశారు. శనివారం డివిజన్ పరిధిలోని పాత రైల్వే ట్రాక్ పక్కన ఖాళీస్థలంలో వ్యర్థాలను నిల్వ చేసి కాల్చడం వల్ల వచ్చే పొగతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, కాలనీవాసులు మాట్లాడుతూ... వ్యర్థాలను నిల్వచేసి కాల్చడంతో వచ్చే పొగతో బాలాజీనగర్ కాలనీవాసులు, మార్కెట్ యార్డు, స్కూల్ పిల్లలు ఇబ్బందిపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థాలను కాల్చుతున్న వారిపై పీసీబీ అధికారులు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

స్థలం కేటాయించండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న తండావాసులు

ఝరాసంగం(జహీరాబాద్): బంజారా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని తండావాసులు కోరారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రం ఝరాసంగం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైనా తమకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. అలాగే, సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో చీలపల్లి తండా, భోజ్యానాయక్ తండాలువాసులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



స్వయంపాలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా అర్చన, డిప్యూటీ ఈఓగా సౌమ్య, హెచ్‌ఎంగా భానుప్రసాద్ వ్యవహరించారు. విద్యార్థులు టీచర్లుగా మారి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన వారిని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయానికి భారీ విరాళం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి విరాళాలు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాములుగౌడ్ రూ.1 లక్ష 20 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, రమేష్, శ్రీకాంత్‌గౌడ్, బ్రహ్మేందర్ గౌడ్, లింగం, బ్రహేందర్ పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక



జోగిపేట(అందోల్): తెలంగాణ నాల్గొవ తరగతి ఉద్యోగుల సంఘం అందోల్–జోగిపేట యూనిట్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.హరీష్‌కుమార్, కార్యదర్శిగా బి.రఫి, ఉపాధ్యక్షుడిగా ఎస్.మల్లేశం, కోశాధికారిగా డి.ఓంమధు, సంయుక్త కార్యదర్శిగా వై శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడిగా డి.నాగరాణి, కె.బాలయ్య, ఎం.అనురాధ ఎన్నికైనట్లు జిల్లా తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.షరీఫ్, జె.నాగరాజులు ప్రకటించారు.

◆ పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

జోగిపేట (అందోల్): జోగిపేట పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మార్కండేయ స్వామి దేవాలయం ఆవరణలో పద్మశాలి సంఘం కుల పెద్దల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా నన్నే లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా కోషికే సత్యం, సంఘం బాలరాజ్, ప్రధాన కార్యదర్శులుగా పద్మ సుధీర్, పద్మ అనంత రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటనర్సు రమేష్, కోశాధికారిగా బోడ నందీశ్వర్, సహాయ కోశాధికారిగా పులగం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడిగా కోషికే రాజశేఖర్, బొడ్డు రామకృష్ణ, పులగం నాగరాజ్, గౌరవ అధ్యక్షుడిగా యాదగిరి దుర్గారాం, సత్యం ఎన్నికయ్యారు.

◆ సొంత నిధులతో బోరు ఏర్పాటు

కంది(సంగారెడ్డి): ఎండాకాలం దృష్ట్యా గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు మాజీ వార్డు సభ్యుడు సొంత నిధులతో బోరు ఏర్పాటు చేశాడు. శనివారం కందిలోని 4వ వార్డులో మాజీ వార్డు సభ్యుడు మహమ్మద్ గౌస్ రూ.2 లక్షల సొంత నిధులతో కొత్తగా బోర్‌ను వేయించారు. ఈ సందర్భంగా స్థానికులు అతని సేవాగుణాన్ని అభినందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు జంగయ్య, మురళీధర్‌రెడ్డి, బూడిద కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ మాజీ మాజీ కౌన్సిలర్‌కు సన్మానం

జోగిపేట(అందోల్): అందోల్–జోగిపేట మున్సిపాలిటీ 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబును కాలనీవాసులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. భవిష్యత్తులో కూడా కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.


◆ రెండు లక్షల రుణమాఫీ ఘనత కాంగ్రెదే

మునిపల్లి(అందోల్): అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని మాజీ ఎంపీపీ రాంరెడ్డి శనివారం తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఒకేసారి చేయలేదన్నారు. రెండు లక్షల రూపాయలపైన ఎవ్వరికి మాఫీ కాలేదన్నారు. ప్రణాళిక ప్రకారం లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, చెక్కులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి దామోదర రాజనర్సింహ్మ విద్యా, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. అత్యవసరమున్న చోట సీసీ రోడ్లు వేశామన్నారు. సింగూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారని తెలిపారు. అవగాహన లేకుండా కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు.

◆ వీడ్కోలు సమావేశం

సదాశివపేట (సంగారెడ్డి): పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులు రెండవ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ బాల్‌రాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని కాలయాపన చేయకుండా చదువుకోవాలన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, రాజు, అధ్యాపకులు మనోహర్, మల్లేశం, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి న్యూటన్ కాలనీలో శుక్రవారం వీధి కుక్కలు ఐదేళ్ల బాలుడుపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం కుక్కల దాడి సంఘటనపై తెల్లాపూర్ కమిషనర్ సంగారెడ్డి విచారణ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు కుక్కలు దాడి చేసి తమ పిల్లవాడిని తీవ్రంగా గాయపరిచాయని కమిషనర్‌కు వివరించారు. బాలుడికి మెరుగైన చికిత్స అందించేందుకు నారాయణగూడలోని రేబిస్ ఆస్పత్రికి పంపించారు. కొన్ని రోజుల క్రితం కుక్కలకు వ్యాక్సిన్ చేయించినట్లు చెప్పారు. కరిచిన కుక్కలపై నిఘా పెడుతున్నామని పేర్కొన్నారు.